ప్రజాశక్తి
శనివారం 18 నవంబరు 2023
5
శ్రీకాకుళం

ఘనంగా నాగులచవితి

కొటబొమ్మాళి : వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

జిల్లాలోని వాడవాడలా నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలకు సమీపంలో ఉన్న పుట్టల వద్దకు బాణసంచా కాల్చి సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఆనందంగా గడిపారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ సొంత గ్రామంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులలో కలసి నాగులు చవితి వేడుకలను నిర్వహించారు.

సాఫీగా సాగేనా?

- ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఈ ఏడాది 5.40 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- 390 చోట్ల కేంద్రాల ఏర్పాటు
- రెండు రోజుల్లో ప్రారంభం కానున్న వైనం

అన్నదాతలకు ఈ ఖరీఫ్‌లో సాగు అంతగా కలిసి రాలేదు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విత్తనాలు వేయలేకపోయారు. మరోవైపు చివరి తడులకు నీరందక పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి. వర్షాలు కాస్తా, కూస్తో కురిసిన ప్రాంతాలు, కాలువల కింద ఆయకట్టు భూముల్లో కొంత వరకు పంట పండింది. జిలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయి. మరోవైపు ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం సేకరణకు పాత నిబంధనలే అమలు చేస్తున్నా... అందులో లోపాలను సవరించి రైతులకు న్యాయం చేస్తామని చెప్తున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ జరిగింది. 3,34,330 ఎకరాలకు ఈకెవైసి పూర్తయింది. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరికి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్ 'ఎ' రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు జిల్లావ్యాప్తంగా 390 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. 2 వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశం ఉన్న కేంద్రాలను ఎ కేటగిరిగా, వెయ్యి నుంచి 2 వేలు టన్నుల లోపు వరకు కొనుగోలు చేసేవాటిని బి కేటగిరిగా విభజించారు. అదేవిధంగా వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉన్నవాటిని సి కేటగిరిగా నిర్ణయించారు. జిల్లాలో ఎ కేటగిరిలో 182, బి కేటగిరిలో 176, సి కేటగిరిలో 32 కేంద్రాలు ఉన్నాయి.

ప్రారంభానికి ఏర్పాట్లు

ధాన్యం కొనుగోలుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు వంటి అవసరాల కోసం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికపై 1170 మందిని నియమించారు. వీరికి మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేశారు. మిల్లులకు తరలించిన తర్వాత వాటిని మర ఆడించేందుకు 255 మిల్లులను ఎంపిక చేశారు. మర ఆడించేందుకు ఇస్తున్న ధాన్యం విలువకు సమానమైన బ్యాంకు గ్యారంటీలను మిల్లర్ల నుంచి తీసుకునేందుకు వారితో చర్చలు జరుపుతున్నారు. ఇవన్నీ పూర్తి చేసి మరో రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని అధికారులు చెప్తున్నారు

వాహనాలకు జిపిఎస్ పరికరాలు

ధాన్యం సేకరణలో ఈ సంవతసరం కొత్త జిపిఎస్ పరికరాలను వినియోగిస్తున్నారు. కళ్లాల నుంచి మిల్లులకు ధాన్యం తీసుకువెళ్లే వాహనాలకు జిపిఎస్ పరికరాలను అమర్చుతున్నారు. ధాన్యం కొనుగోలులో పారదర్శకత కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాలో 5 వేలు పరికరాలు అవసరమవుతాయని గుర్తించారు. ఇప్పటివరకు 600 వరకు అందుబాటులో ఉంచారు.

సమస్యలను అధిగమిస్తారా?

ధాన్యం కొనుగోలులో గతేడాది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీ విలువ పూర్తవడంతో దూర ప్రాంతాల్లోని మిల్లులకు కేటాయించారు. ముఖ్యంగా ఒక మండలానికి చెందిన రైతులకు 40, 50 కిలోమీటర్ల దూరంలో వేరే మండలంలో ఉన్న మిల్లులకు కేటాయించారు. దీంతో రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. మిల్లర్లు సకాలంలో బ్యాంకు గ్యారంటీలు సమర్పించకపోవడంతో తమకు కేటాయించిన మిల్లులకు రైతులు ధాన్యం తీసుకువెళ్లలేకపోయారు. గతేడాది జనవరి మొదటి వారం వరకు 72 మంది ధాన్యం నాణ్యంగా లేవంటూ కొన్ని చోట్ల రైతులను తిప్పి పంపారు. కొన్ని ఆర్‌బికెల్లో తమ లక్ష్యం పూర్తయిందని, ఇక కొనలేమంటూ సిబ్బంది చెప్పడంతో దళారులకు తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది. గతేడాది నుంచి ధాన్యం కొనుగోలుకు యాప్ వినియోగించడంతో సర్వర్, సిగ్నల్ సమస్యలు తలెత్తడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. వీటిని అధిగమిస్తే ధాన్యం సేకరణకు ఉన్న ఇబ్బందులు అధిగమించే అవకాశాలు ఉన్నాయి.

పంటన్నంటినీ కొనుగోలు

ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రెండు రోజుల్లో కొనుగోలు ప్రారంభిస్తాం. ధాన్యం కొనుగోలుకు ఎటువంటి లక్ష్యం లేదు. ఈ క్రాప్‌లో నమోదైన పంటనంతటినీ కొనుగోలు చేస్తాం. రైతులు ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలకనుగునంగా ధాన్యాన్ని సిద్ధం చేసి తీసుకురావాలి.

- కె.శ్రీనివాసు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి రాధిక

సిఎం పర్యటన వాయిదా

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

జిల్లాలో ఈ నెల 23న పలాసకు రావాల్సిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి పర్యటన వాయిదా పడినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది తాత్కాలిక వాయిదా మాత్రమేనని, త్వరలోనే సిఎం పర్యటన వివరాలను తెలియజేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా పలాసలో ఉద్దానం తాగునీటి పథకం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్లను ప్రారంభించాల్సి ఉందన్నారు. త్వరలో మరో తేదీని తెలియజేస్తామని స్పష్టం చేశారు.

పర్యటన ఏర్పాట్లు నిలిపివేత

ముఖ్యమంత్రి జగన్ 23న పలాస వస్తారనే సమాచారంతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్.రాధిక శుక్రవారం పలాసలో పర్యటించారు. కాశీబుగ్గ పద్మనాభపురం సమీపంలో నిర్మించిన 200 పడకల ఆస్పత్రి,కిడ్నీ పరిశోధన కేంద్రం, హెలీప్యాడ్ స్థలం, సిఎం బహిరంగ సభ పరిసర ప్రాంతాలను శుక్రవారం కలసి పరిశీలించారు. కిడ్నీ ఆస్పత్రి పనులు ఎంత శాతం పూర్తయ్యింది... ఇంకా ఏ మేరకు పనులు చేయాల్సి ఉంది తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కిడ్నీ ఆస్పత్రి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి సమీపంలోని హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాశీబుగ్గ రైల్వే మైదానంలో సిఎం బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో ఆసుపత్రి నుంచి రైల్వే మైదానం వరకు భారీ స్థాయిలో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన వాయిదాతో ఏర్పాట్లను నిలిపేశారు.

పాతపట్నం బస్సు యాత్ర వాయిదా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పాతపట్నంలో ఈ నెల 21న జరగాల్సిన సామాజిక సాధికార యాత్ర తాత్కాలికంగా వాయిదా పడినట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఈ యాత్రను వేయిదా వేశామని అన్నారు. బస్సు యాత్ర ఎప్పుడు నిర్వహించేది త్వరలో మరో తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

న్యాయస్థానానికి చంద్రబాబు తప్పుడు అఫిడవిట్లు

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, అయితే తన ఆరోగ్యం సక్రమంగా లేదని న్యాయ స్థానానికి తప్పుడు నివేదికలు అందజేయడం ప్రజలు గమనిస్తున్నారని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రగతి భవనంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా తన న్యాయవాదుల ద్వారా ఇంటి వద్దనే తప్పుడు పత్రాలు తయారు చేసి కోర్టుకు సమర్పించి తప్పుదోవ పట్టించి బెయిల్ పొందాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబుకు గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలుంటే ముందుగా ఎంజోగ్రామ్ చేయించాలని, అలా చేయించకుండా తన స్వార్థప్రయోజనాల కోసం ఆస్పత్రులను వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఆయనకు ఉన్న అనారోగానికి జైలు నుంచి విడుదలైన తక్కువ రోజుల్లో ఆపరేషన్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు స్కిల్ డవలప్‌మెంట్ స్కేమ్‌లో రాజమండ్రి సెంటల్ జైల్లో ఉన్న సమయంలో ఆయన ముసలివాడు అయిపోయాడని, అనేక రోగాలున్నాయని చంద్రబాబు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ప్రచారం చేశారని గుర్తు చేశారు. దీని వెనుక అనేక కుట్ర కోణాలున్నాయని ఆరోపించారు.

గురువు నిరంతర విద్యార్థి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సన్మానిస్తున్న ఒఎస్‌డి సుధాకర్‌బాబు

గురువుగా విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు ఈ మూడేళ్లు రాజీవ్ గాంధీ యూనివర్సిటీకి అందించిన సేవలు గణనీయమని ఒఎస్‌డి సుధాకర్‌బాబు అన్నారు. డైరెక్టర్‌గా మూడేళ్లు సేవలందిస్తున్న జగదీశ్వరరావును అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థులు శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేసి శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ యూనివర్సిటీకి డైరెక్టర్‌గా మూడేళ్లపాటు సేవలు అందించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇక్కడ వాతావరణం చాలా ఆహ్లాదకరమై ఉంటుందని చెప్పారు. క్రమశిక్షణ, జ్ఞానం పెంపొందించి, లక్ష్యంపై వారికి స్పష్టమైన అవగాహన కలిగించి, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. 'మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ' అనే సూక్తి, తల్లిదండ్రుల తర్వాత గురువులకు ఉన్న ప్రాధాన్యం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రవి పాల్గొన్నారు.

కుల గణనతో అందరికీ సంక్షేమం

ప్రజాభిప్రాయ సేకరణలో స్పీకర్ సీతారాం

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాజికంగా సంక్షేమ పథకాలను మెరుగ్గా రూపొందించడానికి, వాటిని అమలు చేయడానికి జనాభాలోని అన్ని వర్గాల సామాజిక, విద్య, ఆర్థిక, జీవనోపాధి తదితర అంశాలతో కుల ఆధారిత సమగ్ర గణనను చేపట్టడం అత్యవసరమని శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం అన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాలు, కుల సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆధ్వర్యాన బృందావనం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం గత 92 ఏళ్లలో ఎప్పుడూ సేకరించ లేదని అన్నారు. ఈ గణన వల్ల చిన్న తరగతులనూ గుర్తించి వారి సమస్యలు, స్థితిగతులు తెలుసుకుని అభివృద్ధి ఫలాలను అందించడానికి దోహదపడుతుందన్నారు. కుల గణన సర్వే పూర్తయితే సామాజిక తరగతుల వారీగా జనాభా ప్రతిపదికన సంక్షేమ పథకాలను అందించేందుకు వీలవుతుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందించడానికి వీలవుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని తరగతులకు చెందిన కులాల వారి సంఖ్యను ఈ నెల 27 నుంచి లెక్కించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. అందులో భాగంగానే వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ తదితర కుల సంఘాల నాయకులతో కుల గణన సర్వేపై సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనా పథకాలకు, మానవవనరుల అభివృద్ధికి, పేద, ధనికుల మధ్య తారతమ్యాలు తగ్గించేందుకు, సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు ఈ డేటా ముమ్ముందు ఎంతగానో వినియోగపడుతుందని తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలు తెలియజేసిన వివరాలు మాత్రమే నమోదు చేస్తామన్నారు. ఇందుకు ఎటువంటి ఆధారాలు ఇవ్వవాల్సిన అవసరం లేదన్నారు. ఈ సర్వే ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులందరికీ అవసరమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. సేకరించిన సమాచారం అత్యంత భద్రతలో ఉంచుతామన్నారు. ఈ విషయమై సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, పి.తిలక్, అంధవరపు సూరిబాబు, డి.పి.దేవ్ పాల్గొని కులగణన ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, పొందర కూరాకుల చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ ప్రతినిది పంగ భావాజీనాయుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్ట చంద్రపతిరావు, దళిత సంఘాల జెఎసి నాయకులు కంఠ వేణు, టైక్వాండో శ్రీను, కోరుపూరు గజపతి రావు, రౌతు శంకరరావు, చింతాడా రామ్మోహన్, మహ్మద్ రఫీ, బాడాన దేవ భూషన్, జుత్తు నీలకంఠం, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, బిసి కార్పొరేషన్ ఈడి గెడ్డమ్మ, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్. లక్ష్మీప్రసన్న, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనురాధ పాల్గొన్నారు.

వెలుగు సిఎఫ్ చేతివాటం

- రూ.2.40 లక్షలు సొంతానికి
- సొంత డ్వాక్రా గ్రూప్‌నూ వదల్లేదు
- స్పందనలో ఫిర్యాదుతో వెలుగులోకి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాలి మండలం నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘానికి చెందిన వెలుగు సిఎఫ్ పరపటి సుమలత చేతివాటం ప్రదర్శించి మహిళా సంఘాలకు చెందిన డబ్బులను కాజేసింది. సుమారు రూ.2,40,000 తన సొంతానికి వాడుకుంది. దీనిపై నౌపడకు చెందిన వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళ్తే... సిఎఫ్ సుమలత మూడేళ్ల నుంచి ఎస్‌హెచ్‌జి (డ్వాక్రా గ్రూప్) సభ్యులు స్త్రీ నిధి నుంచి తీసుకున్న అప్పును తీర్చడానికి తనకు ఇచ్చిన డబ్బులను ఆమె సొంతానికి వాడుకుంది. అలాగే సిఐఎఫ్ నిధులు కూడా తన సొంత అవసరాలకు వినియోగించుకుంది. పొదుపు నుంచి తీసిన డబ్బులను స్త్రీనిధి ఖాతకు జమచేసి సమృద్ధి ఖాతాకు మళ్లించకుండా అవసరాలకు వినియోగించుకుంది. ఇలా సంఘాల నుంచి రూ.2,40,000 డబ్బులు అవినీతికి పాల్పడినట్లు తేలింది. బాబా గ్రూపు నుంచి రూ.45,000, సాగర కన్య గ్రూపు నుంచి రూ.48,000, జైసంతోషిమాత గ్రూపు నుంచి రూ.7500, పెద్దమ్మతల్లి గ్రూపు నుంచి రూ.7500, భాస్కరమ్మ గ్రూపు నుంచి రూ.7,500, రామకృష్ణ గ్రూపు నుంచి రూ.7,200, అమ్మ భవాని గ్రూపు నుంచి రూ.7200, మధుప్రియ గ్రూప్ నుంచి రూ.7200, కొత్తమ్మ తల్లి గ్రూపు నుంచి రూ.8400, నూకాలమ్మ గ్రూపు నుంచి రూ.7200, శ్రీదత్త గ్రూప్ నుంచి రూ.7500, సాయి సంతోషి గ్రూప్ నుంచి రూ.7500, డబ్బులను తన సొంత అవసరాలకు సిఎఫ్ వాడుకుంది. ఇంతటితో ఆగకుండా తన సొంత గ్రూపైన లక్ష్మీగణపతి గ్రూప్ నుంచి రూ.30 వేలును విత్‌డ్రా చేసుకుని సొంతానికి వాడేసుకుం ది. దీనిపై స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనికి సంబంధించి ఎటువంటి రికార్డులు సుమలత వద్ద లేకపోవడంతో అక్రమాలకు మరింత బలం చేకూర్చాయి. లోను లగ్జర్, క్యాష్ బుక్, రసీదు బుక్కులు, లేకపోవడం కొసమెరుపు. గ్రూపు సభ్యులు తీర్మానం లేకుండా బ్యాంకు అధికారులు డబ్బులు ఎలా చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదని గ్రూప్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని డ్వాక్రా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

రూ.2.40 లక్షలు గుర్తించాం

సిఎఫ్ సుమలత వివిధ డ్వాక్రా గ్రూపుల నుంచి రూ.2, 40,000 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించాం. దీనికి సంబంధించిన రికార్డులు పలుమార్లు అడిగినా సిఫ్ ఇవ్వడం లేదు. మండలంలో జరిగే సమావేశాలకు కూడా ఎక్కువ శాతం గైర్హాజరు అవుతుంది.

- సూర్యనారాయణ, వెలుగు ఎపిఎం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

బూర్జ: టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, వైసిపి అరాచక పాలనను తరిమికొట్టాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రం బూర్జలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫోస్టోను వివరిస్తూ... పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందస్తామని అన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే వారందరికీ అమ్మకు వందనం పేరుతో రూ.20 వేలు అందజేస్తామన్నారు. గృహిణులకు ఏడాదికి నాలుగు వంట గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందజేస్తామని అన్నారు. బూర్జ ఎంపిటిసి పోలనాయుడు, లంక జగన్నాథంనాయుడు, సర్పంచ్‌లు అంపిలి గణపతరావు, హనుమంత్ గోపి మాస్టారు, పప్పల కృష్ణారావు, బిసిసెల్ మండల అధ్యక్షులు దుర్గారావు, గిరి కడగల కృష్ణ, మాజీ సర్పంచ్‌లు బగాది శ్రీరాములునాయుడు, బి.సోమినాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల పయనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు పి.సుందరరావు పిలుపు నిచ్చారు. పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి శుక్రవారం పయనమయ్యారు. వీరికి నగరంలోని పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో వారికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతున్న జిల్లాకు ఎంతో ఘన చరిత్ర ఉందని గుర్తు చేశారు. క్రీడా స్ఫూర్తినితో క్రమశిక్షణగా ఆడి, పట్టుదల, అంకితభావంతో తుదివరకు పోరాడాలని సూచించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ ప్రత్యర్థుల క్రీడా ప్రతిభను అంచనా వేసుకుని పోటీల్లో పైచేయిగా నిలవాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ జిల్లా అధ్యక్షులు కొమర భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రపోటీల్లో జిల్లా నుంచి 28 మంది బాలబాలికలు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉషు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నరసింహులు, జిల్లా తైక్వాండో బృందానికి కోచ్ మేనేజర్లుగా కురిటి తారకరామా, లక్ష్మణరావు, ముద్దాడ శిరీష పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న సుందరరావు

న్యాయం చేస్తాం... అధైర్యపడొద్దు

జిల్లా వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని, అనంతరం రైతులకు న్యాయం చేసేలా చేస్తామని, రైతులెవరూ అధైర్య పడొద్దని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్ భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నసున్నాపురం, డేగలపోలూరు గ్రామాల్లో సాగునీరు, వర్షాభావ పరిస్థితుల్లో ఎండిన వరి పంట పొలాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఎండిన పంటలపై ప్రాథమిక వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో పాడైన పంటల్లో ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని అన్నారు. రాగులు, పెసలు, మినుములు తదితరులు పంటలు వేసుకోవాలని సచించారు. పంట కోత ప్రయోగాల ద్వారా మీ ప్రాంతంలో పండే పంట సరాసరి దిగు బడిని అంచనా వేస్తున్నామని అన్నారు. దీని ద్వారా మీ పరిధిలో చాలా మంది రైతులకు వైఎస్ఆర్ క్రాప్ ఇన్స్యూరెన్స్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఎండిన పంటలపై ప్రభుత్వ ఆదేశాలకు లోబడి తగు చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అనంతరం మెళియాపుట్టి రైతు భరోసా కేంద్రం పరిధిలో 50 శాతం రాయితీపై కట్టె జనుము విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ఎవరికైనా కావాలంటే మీ ప్రాం తాల్లోని ఆర్‌బికెల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందరికీ విత్తనాలు అందజేస్తామని చెప్పారు. పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మధుబాబు, మండల స్పెషల్ ఆఫీసర్ భవానీశంకర్, తహశీల్దార్ పి.సరోజని, మండల ఎఒ దానకర్ణుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వైకుంఠరావు, సర్పంచ్ వెంకటేశు, గ్రామ వ్యవసాయ సహాయకులు శరత్‌కుమార్ రెడ్డి, షణ్ముఖరావు, త్రినాథరావు, గ్రామ రెవెన్యూ అధికారులు శామ్యూల్, రత్నం, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న జెడి శ్రీధర్

సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న స్పీకర్ సీతారాం

గడప గడపకు సంక్షేమం
స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడపగడపకు సంక్షేమం అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తకోట, నక్కలపేట గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుతెన్నులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. నాలుగున్నర ఏళ్లగా ప్రజల జీవన ప్రమాణాలను సంక్షేమ పథకాల ద్వారా పెంచగలిగామన్నారు. పాలనను ప్రజల వద్దకు సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, ఎంపిటిసి సురవరపు సింహాచలం, నడుపూరు గోవిందరావు, మాజీ సర్పంచ్ కాణితాపల్లి నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి శివానందబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలావు చంద్రశేఖర్, ఎన్‌సిఎల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అమలపాడు పంచాయతీలో ఇటీవల మృతి చెందిన దున్న వల్లప్పగారి మోహనరావు కుటుంబానికి సర్పంచ్ దున్న రత్నం బాలరాజు వైఎస్ఆర్ బీమా ఆర్థికసాయం అందించారు. శుక్రవారం సర్పంచ్ ఆయన కుటుంబాన్ని కలిసి తక్షణసాయం రూ.10వేలు నగదును కుటుంబ సభ్యురాలు కమలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా పేద ప్రజలకు ఎంతో అండగా నిలుస్తుందన్నారు. మిగిలిన బీమా సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి దున్న బాలరాజు, వార్డు సభ్యులు దున్న శాంతి, దున్న ఢిల్లీరావు, గ్రామ వైసిపి అధ్యక్షులు లింగరాజు, సచివాలయం కన్వీనర్ కామరాజు, వాలంటీర్ ప్రేమ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఈనెల 27న నిర్వహించనున్న సామాజిక సాధికారిక బస్సు యాత్రలో ప్రతిఒక్కరు పాల్గొని విజవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కోరారు. శుక్రవారం తాళ్ళవలస, గుమ్మడాం పంచాయతీల్లోని సచివాలయల్లో సాధికారిక యాత్ర కోసం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 27న చిలకాపాలెంలో సామాజిక సాధికారిక బస్సుయాత్ర ఘనంగా జరిగేలా ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసురావు, తాళ్లవలస, గుమ్మడాం సర్పంచ్ ప్రతినిధులు దేశెట్టి తిరుపతిరావు, ధర్మారావు పాల్గొన్నారు

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాంప్రసాద్

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఒలంపియాడ్-2023 (నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్టు) పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మహాలక్ష్మినగర్ కాలనీ సమీపంలో ఉ్న శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు నుంచి పదో తరగతి వరకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో అత్యధికంగా 260 మంది విద్యార్థులు సెకెండ్ లెవెల్‌కు అర్హత సాధించారని అన్నారు. ఈ ఫలితాలతో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరింత ఖ్యాతి గడించాయన్నారు. మేథ్స్ విభాగం నుంచి 85 మంది, ఫిజిక్స్ విభాగం నుంచి 73 మంది, కెమిస్ట్రీ విభాగం నుంచి 102 మంది విద్యార్థులు సెకెండ్ లెవెల్‌కు అర్హత సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల జిల్లా రీజనల్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, జోనల్ అకడమిక్ డీన్ పి.మోహనబాబు, పాఠశాల అకడమిక్ డీన్ సిహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇంద్ర మౌళి, ఐపియల్ ఇన్‌ఛార్జి బి.జనార్థన్, సి.బ్యాచ్ ఇన్‌ఛార్జి ఎస్.లక్ష్మీకాంత్, సివిల్స్ బ్యాచ్ ఇన్‌ఛార్జి బి.ప్రసాద్, మెడికాన్ ఇన్‌ఛార్జి టి.రామ్మోహన్, పాఠశాల ఎఒలు పి.శ్రీనివాసరావు, బి.రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ బాలుర పోటీలకు మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు చాకిపల్లి అక్షయ్, పి.పార్ధసారధి, 7వతరగతి చదువుతున్న చాకిపల్లి అక్షయ్‌లు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, ఎస్.రమేష్, క్రాంతిలను ప్రధానోపాధ్యాయులు అనూరాధతో పాటు ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, పొట్నూరు జగదీష్, కాపల నారాయణరావు, భారతి, తమ్మినేని వైకుంఠరావు, సుధారాణి, దుర్గారావు అభినందించారు.



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజా సంక్షేమమే టిడిపి ధ్యేయం

పలాస : ప్రచారంలో పాల్గొన్న గౌతు శిరీష

కోటబొమ్మాళి : పోస్టర్లను అందజేస్తున్న రమేష్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, సకాలంలో సాగునీరు అందక, పంట కోసం పెట్టిన పెట్టుబడులు వస్తాయో లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని, రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి పలాస నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష డిమాండ్ చేశారు. మందస మండలం పిడిమందస పంచాయితీ మధ్య, నర్సింగపురం పంచాయతీ దేవుపురం, నర్సింగపురం, టంగరపుట్టి గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ కాలంలో వర్షాలు లేక, రైతులు పెట్టిన పెట్టుబడులు రాక రైతులు దిగులుతో ఉన్నారని, అయినా వైసిపి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టో పంపిణీ చేశారు. కార్యక్రమంలో భావన దుర్యోదన, తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్ కుమార్, అగ్గున్న జయరాజు, గేదెల రామకృష్ణ, డొక్క లక్ష్మీనారాయణ, నీర గిరిధర్, భాస్కర్ గౌడ, సవర లఖియా, శంకర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. మేజరు పంచాయతీ పరిధిలో ప్రకాష్‌నగర్ కాలనీ, విద్యుత్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి కృష్ణారావు, మూగి అచ్చయ్యరెడ్డి, కోరాడ గోవిందరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక అప్పల సూరన్నాయుడు (రాజు) అన్నారు. మండలంలోని దూసి ఆర్ఎస్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని అప్పలనాయుడు, కంచరాన లోకేశ్వరరావు, కోటినాయుడు, బాబురావు, జనసేన నాయకులు మురపాక రాజశేఖర్, గౌతమ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: రానున్న ఎన్నికల్లో వైసిపి ఇంటికే పరిమితం కానుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆంబళ్ల రాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నందికొండ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి నందివాడ గోవిందరావు, లావేటి పూర్ణారావు, గుర్రాల చిన్నబాబు, దవళ సింహాచలం, కొర్ను సూర్యనారాయణ, ఎండ రామారావు, కొమనాపల్లి రవి, దవళ సురేష్ పాల్గొన్నారు.

పోలాకి: బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గుప్పాడపేట గ్రామంలో మాజీ శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని రాష్టంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దోపిడీలను వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, జనసేన నాయకులు బలగ ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షులు దండాసి, సీనియర్ నాయకులు బైరి భాస్కరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి కారుకోల దృశ్యంత్, నాయకులు రోనాంకి కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

పోలాకి : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

సరుబుజ్జిలి : పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సామాజిక ఆస్పత్రుల తనిఖీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఉన్న పరికరాలు, స్థితిగతులను అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ అనురాధ తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఉన్న పరికరాలు, వాటి స్థితిగతులు, ఏ విధంగా పనిచేస్తున్నాయి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని పరిశీలించారు. అదేవిధంగా హెచ్ఐవికి సంబంధించి, టిబి పేషెంట్లుకు ప్రత్యేక శ్రద్ధ వహించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. టిబి పేషెంట్ల కోసం ప్రత్యేకంగా రూ.1500 విలువగల ఆహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇచ్ఛాపురం, సోంపేట, కొలిగాం, కొల్లం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రులతో పాటు స్థానికంగా ఉన్న ప్రైవేట్ ల్యాబ్‌లు పరిశీలించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో మందులు, సూదులు రోగులకు కావలసిన సకల సదుపాయాలు చేకూర్చే విధంగా ప్రత్యేక నిధులు రాష్ట్ర ప్రభుత్వం చేకూరుస్తుందన్నారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

21న సిక్కోలు అమరుల స్మారక సభ

ప్రజాశక్తి- పలాస

గిరిజన రైతాంగ పోరాట అమరవీరుల 45వ స్మారక సభను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సూదికొండ కాలనీలో పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విప్లవం కోసం ఎంతోమంది మేధావులు డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, దోపిడి వ్యవస్థని కూల్చాలని పోరాడారని, అమరవీరులు వదిలి వెళ్లిన ఆశయాల పతాకాన్ని కార్యకర్తల భుజస్కందాల పైన వేసుకొని ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు. వీరాస్వామి, నాయకులు వంకల పాపయ్య, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి బైరి కూర్మారావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, పివైఎల్ నాయకులు సునీల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో సీతవలస గ్రామంలో తాగునీరు సమస్య ఎక్కువుగా ఉందని ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకులు డా.విశ్వక్సేన్ దృష్టికి ఆ గ్రామ జనసేన నాయకులు తీసుకురావడంతో సొంత నిధులతో తాగునీటి సమస్యను తీర్చారు. విషయం తెలుసుకొని ఆ గ్రామంలో రెండురోజుల క్రితం పర్యటించి మహిళలు నుంచి వారి కష్టాలను తెలుసుకొని రెండు రోజుల్లో ఈ గ్రామానికి చెందిన అధికార పార్టీ వైస్‌ఎంపిపి, సర్పంచ్‌లు సమస్యను పరిష్కరించకుంటే నేనే పరిష్కరిస్తానని చెప్పిన నేపథ్యంలో ఎటువంటి పురోగతి లేకపోవడంతో విశ్వక్సేన్ రూ.18వేలు విలువగల 2 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ఇచ్చారు. స్థానిక జనసేన నాయకులు మరికొంత మొత్తంతో ఆ గ్రామంలో రెండు వీధులకు పైప్‌లైన్‌తో వాటర్ సరఫరా చేసి శుక్రవారం మహిళలకు అందించారు. రణస్థలం మండల జనసేన అధ్యక్షులు బస్వ గోవింద్ రెడ్డి, సూర్య, వడ్డాది శ్రీనివాసరావు, దుర్గారావు, కాకర్ల బాబాజీ, అప్పలకొండ పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలకు ఆమోదం

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో ఐదు ప్రధాన వంతెనలు నిర్మాణానికి అవసరమైన పరిపాలన ఆమోదాలు లభించినట్లు సీడ్ ఎపి చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇచ్ఛాపురం మండలంలో బుర్జపాడు, డొంకురు గ్రామాల మధ్య రెండు వంతెనలు, బారువ, రట్టి మధ్య మూడు వంతెనల నిర్మాణం కోసం పరిపాలన ఆమోదం వచ్చినట్లు తెలిపారు. తొందరలో టెండర్లు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు.

యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు టేకి సుధీర్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కోశాధికారి బమ్మిడి శ్రీరామమూర్తి, ఎన్నికల పరిశీలకులుగా కోరాడ వైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆర్. దమయంతి హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న పెండింగ్ బకాయిలు చెల్లించాలని, జీవో నెంబర్ 117 రద్దు చేయాలని, ప్రాథమిక విద్యను బలపర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి కె.ఆదినారాయణ గత సంవత్సరం చేసిన పోరాటాలపై నివేదిక ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎఆర్ఆర్ భూషణరావు, అధ్యక్షులుగా టేకి సుధీర్ కుమార్, సహాధ్యక్షులుగా రోనంకి బాబురావు, విశాలాక్షి, ప్రధాన కార్యదర్శిగా కుంచి ఆదినారాయణ, కోశాధికారిగా పూతి కృష్ణారావు, కార్యదర్శులుగా సూర్యప్రకాష్, నారాయణ, తిరుమలరావు, వి.మన్మధరావు, రమేష్ పట్నాయక్, రమణ, బి.వీర్రాజు, ఎన్.ఉత్తరుడు, ఎం. రాజారత్నం, రఘు, తాతన్నాయుడు, శ్యామ్, పి.సత్యనారాయణ, అలాగే జిల్లా కౌన్సిలర్‌గా తవుడు, హరినారాయణ, ఎన్.సింహాచలం, రమేష్, లక్ష్మణరావు, రామారావు, చిన్నికష్ణ, ఆడిట్ కమిటీ వేణుగోపాలరావు, షేక్ షాజహాన్, షేక్ నజరుద్దీన్ ఎంపికయ్యారు.

టెక్కలి: యుటిఎఫ్ టెక్కలి మండల నూతనశాఖ ఏర్పాటు జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఎం. కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా టి. వైకుంఠరావు, అధ్యక్షులుగా పి.గణపతిరావు, సహాధ్యక్షులుగా ప్రభావతి, డి.పాపారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.దాలయ్య, ఎన్నికల పరిశీలకులుగా కెవి శ్రీరామ్మూర్తి వ్యవహరించారు

నరసన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న బమ్మిడి శ్రీరామ్మూర్తి

రైల్వే వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

పలాస : పలాస రైలు నిలయం పక్కనే ఉన్న నర్సిపురంకు వెళ్లే కాలిబాట వంతెనకు రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టారు. కాలిబాట వంతెన ప్రమాదకరంగా ఉందని రైల్వే అధికారులు మూసి వేయటంతో నర్సిపురం గ్రామస్తులంతా ఇబ్బందులు పడ్డారు. దీంతో టిడిపి ఎంపీ కె.రామ్మోహన్ నాయుడుతో పాటు మంత్రి అప్పలరాజు వద్ద విన్నవించటంతో పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులతో సంప్రదింపులు, వినతిపత్రాలు అందించిన మేరకు శుక్రవారం రైల్వే అధికారులు కాలిబాట వంతెనకు మరమ్మతులు చేపట్టారు. రైలు నిలయంలో ఒకటవ ఫ్లాట్‌పారం వైపు రాకుండా నిలుపుదల చేసి, విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. భారీ క్రేన్ సహాయంతో పాత కాలిబాట వంతెనను తొలగించి నూతనంగా తయారు చేసిన వంతెనను పెట్టారు. త్వరలో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించి కాలిబాట వంతెన పున్ణ ప్రారంభానికి చర్యలు చేపడతామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. క్రమంలో ఎఇఎన్ (బెర్హం పూర్) ఆర్.ఆర్.దాస్, పలాస, బెర్హంపూర్ సీనియర సెక్షన్ ఇంజినీర్లు సత్యనారాయణ పండా, కిషోర్ కుమార్, జెఇలు సుజిత్ కుమార్, శ్రీమయి మహాపాత్రో, సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు చేపడుతున్న వంతెన

హుదూద్ ఇళ్ల కేటాయింపులో జాప్యం ఎందుకు?

మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన హుదూద్ ఇళ్ల కేటాయింపులో ఎందుకు జాప్యం వహిస్తున్నారని, తక్షణమే తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలని జనసేన నాయకులు హరీష్ కుమార్, శ్రీకాంత్, విశ్రాంత ఎస్ఐ కూన కృష్ణారావు అన్నారు. సూదికొండ ప్రాంతంలో నిర్మించిన హుదూద్ ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుదూద్ తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ఇళ్లు మంజూరు చేస్తామని పారిశ్రామికవాడ సమీపంలో, బెండి పంచాయతీ పరిధిలో ఇళ్లు నిర్మాణం చేపట్టారని, హుదూద్ తుఫాన్ వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా ఇంకా బాధితులకు ఇళ్లు ఇవ్వకపోవడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వీరితో పాటు జనసేన నాయకులు సందీప్, గిరిబాబు, కిరణ్ ఉన్నారు.

బిజెపి ఎచ్చెర్ల కన్వీనర్‌గా రజని

రజని

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల బిజెపి అసెంబ్లీ కన్వీనర్‌గా మండలంలోని బంటుపల్లి పంచాయతీ సర్పంచ్ నడుకుదిటి రజని ఎంపిక య్యారు. ఇంతవరకు కన్వీనర్ భాద్యతలు చేపడుతున్న నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్)ని విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షులు గా నియమించడంతో తన భార్య రజనికి కన్వీనర్ పదవి బాధ్య లను అప్పగించారు. అదే విధంగా ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురంకు చెందిన సంపతిరావు నాగే శ్వరావును కో-కన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి నియమించినట్లు జిల్లా అధ్యక్షులు ఎన్ఇఆర్ తెలిపారు.

ఓటరు నమోదు తప్పనిసరి

కవిటి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటుహక్కు కలిగివుండాలని తహశీల్దార్ పి.శేఖర్ అన్నారు. కవిటి ఎస్‌విజె, బడగల శంకరరావు డిగ్రీ కళాశాలల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు అనే ఆయుధంపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని తెలిపారు. ఎస్‌విజె కరస్పాండెంట్ కింగ్, విఆర్ఒ నారాయణ, ప్రిన్సిపాళ్లు కృష్ణారావు, ఎం.భాస్కరరావు, ఎఒ జోష్ కుమార్, జయప్రకాష్, సుబ్బారావు, ముకుందరావు పాల్గొన్నారు.

లావేరు : మాట్లాడుతున్న విద్యార్థి

గ్రంథాలయాల పరిశీలన

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీను మహేష్ బాబు, అడిషనల్ డైరెక్టర్ వి.రవికుమార్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ వారోత్సవాలు ఎలా జరుగుతున్నాయి, రోజు విద్యార్థులు ఎంతమంది వస్తున్నారు, గ్రంథాలయంలో ఏ కార్యక్రమాలు చేస్తున్నారో విద్యార్థులతో ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయానికి సంబంధించిన పుస్తకాలు, వేసవి శిక్షణా శిబిరాలు, వారోత్సవాలు ఫోటోలు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ టిపికె ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలు, వాటి ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాసరచన పోటీలను పరిశీలించి మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ, భాస్కరరావు, నీలిమ, చిరంజీవి పాల్గొన్నారు.

టెక్కలి: ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి బి.రూపావతి, సహాయకులు ఎస్. అమ్మనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు దిశ చట్టం, మహిళా సాధికారత అనే అంశంపై వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఉపాధ్యాయులు చాడా శ్రీనివాసరావు, చోడవరపు ఈశ్వరరావులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్. శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.రామ్మోహన్, టి.రాంబాబు, యు.కళ్యాణి, పి.వరలక్ష్మి, పి.భానుమతి, శివగణేష్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి శ్రీనివాసరావు, మిథిలా విద్యాలయం కరస్పాండెంట్ ఎం.జయరాం, హెచ్‌ఎం ఇందుమతి, గ్రంథాలయాధికారి చంద్రశేఖర్, సహాయకులు సూర్యనారాయణ, పాఠకులు ప్రకాష్, మహేష్, జగదీష్, సూరిబాబు, సురేష్, శంకర్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా అధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 50 మంది విద్యార్థులు హాజర్యారు. కార్యక్రమంలో స్వర్ణభారతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ గౌరి శంకర్ రెడ్డి, రవి శంకర్ మహా పాత్రో, నారాయణ ఉన్నారు.

కొత్తూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 6, 7, 8 తరగతుల విద్యార్థులచే గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఇందిర, ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కుమార్‌రాజు

సమగ్ర శిక్ష ఎఎంఒగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం ఎఎంఒగా గుంట లక్ష్మీనారాయణను విద్యాశాఖ ఉన్నతాధికారులు నియమించారు. ఇప్పటి వరకు ఆయన పోలాకి మోడల్ స్కూల్ బయాలజీ పిజిటిగా పనిచేస్తున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో ఎఎంఒ పోస్టు ఖాళీ అవడంతో ఆయనను నియమించడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

రోటరీ క్లబ్ చేయూత

ప్రజాశక్తి- సోంపేట

మండలంలో కుమ్మరిపేటలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాలకు సోంపేట రోటరీక్లబ్ సభ్యులు చేయూత అందించారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర వస్తువులు, బట్టలు, దుప్పట్లు, బియ్యం అందజేశారు. సోంపేటకు చెందిన మల్ల నాగేంద్ర, బి.సతీష్ సహకారంతో వీటిని అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు తెలిపారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్, సాన సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యానికి పెద్దపీట

ప్రజాశక్తి- కవిటి

వైసిపి ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసి, కార్పొరేట్ ఆస్పత్రిని తలపించేలా ప్రభుత్వ వైద్యశాలలు తీర్చిదిద్దారని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కొనియాడారు. మండలం బొరివంక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 15 మంది ప్రభుత్వ వైద్యులను నియమించి నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ బి.శ్రీరామ్ ప్రసాద్, ఎంపిటిసి డి.సతీష్, ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, వైద్యులు హరిత, తేజ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రెల్లవీధిలో అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర కార్పొరేషన్ పరిధిలోని రెల్లవీధి లో కాళీకమాత ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, ఉత్తరాంధ్ర కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుర్రి మధు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి గిరిజాశంకర్, దొండపాటి నవీన్ కుమార్, దేవళ్ల విస్సు, ప్రసాద్, గార మండలం పార్టీ అధ్యక్షులు గొండు వెంకట రమణమూర్తి, కామరాజు, ధనుంజయ, పొన్నాడ కిషోర్, బోగి రామారావు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

టెక్కలి రూరల్: టెక్కలిలో కోర్టు సముదాయానికి కేటాయించిన 98 సెంట్లు భూమిలో నూతన కోర్టు భవనాలు, జడ్జి క్వార్టర్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, కార్యదర్శి ఎల్.బాలకృష్ణ, సీనియర్ న్యాయవాదులు బెండి గౌరీపతి, సంపతిరావు దివాకర్ శుక్రవారం టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణికి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందిస్తూ త్వరలో పలాస రానున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో సంప్రదించి నిధులు మంజూరుకు కృషి చేస్తామని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టెక్కలి మాజీ ఎంపిపి సంపతిరావు రాఘవరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్స్ పంపిణీ

టెక్కలి :మండలంలో తలగాం, నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు పదిహేను మంది విద్యార్థులకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాస్మోటిక్స్ పంపిణీ చేశామని డైరెక్టర్ రామముని రమేష్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల చదువుకు అవసరమైన విద్యాసామగ్రిని అందించామన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా సహకారాన్ని పొందిన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు ఎ.ధర్మారావు కోరారు. కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ చైర్మన్ కృష్ణారావు, ఉపాధ్యాయులు బోడ్డేపల్లి విద్యావతి, బి.లత, జె.శ్రీనివాసరావు, డిల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థి

ఇచ్ఛాపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి అండర్-14 బాలురు కబడ్డీ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థి రాజు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గత నెల అక్టోబర్ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 18 నుంచి 20వరకు అన్నమయ్య జిల్లా చిట్వేల్ వేదికగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ప్రధానోపాధ్యాయులు జె. సరోజిని, ఉపాధ్యాయులు అభినందించారు.